సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం । 14 । జూన్ । 2024



ఇబ్రహీంపట్నం: వర్షపునీరు సాఫీగా వెళ్లేందుకు జేసీబీ సాయంతో చెత్తాచెదారం తొలగింపు



బడంగ్‌పేట్: రోడ్డుపై విరిగిపడిన చెట్టు



ఇబ్రహీంపట్నం: రోడ్డుపై నిలిచిన వరదనీరు



బడంగ్‌పేట్: రోడ్డుపై వరదనీటిని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

జోరు వాన

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షపు నీటితోపాటు డ్రైనేజీలు నిండి రోడ్లపై ప్రవహించాయి. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడింది.

న్యూస్‌రీల్

చెరువులు, చెట్లను కాపాడుకుందాం

అటవీ శాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి



మొక్కలకు నీరు పోస్తున్న అటవీశాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి

శంకర్‌పల్లి: చెరువులు, చెట్లను పరిరక్షించుకోకపోతే మానవాళి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ అదనపు కార్యదర్శి ప్రశాంతి ఆవేదన వ్యక్తం చేశారు. మండల రిధిలోని ప్రొద్దటూరు పెద్ద చెరువు వద్ద గురువారం శాస్త్రవేత్తలు, పలు శాఖల అధికారులతో కలిసి తడి నేలల పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె విద్యార్థులతో కలిసి చెరువు కట్టపై మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలన్నారు. చెరువు కట్టపై విరివిగా మొక్కలు నాటి, ఎప్పటికప్పుడు పరిరక్షించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మురుగనందన్, నీటి పారుదల శాఖ ఎస్ఈ రంగారెడ్డి, వైస్ ఎంపీపీ ప్రవల్లిక, ఎంపీడీఓ వెంకయ్య, తహసీల్దార్ సురేందర్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బదిలీలను రద్దు చేయాలి



అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేసిన నిరుద్యోగ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలను గుర్తించి, వెంటనే వారి బదిలీలను రద్దు చేయాలని సేవ్‌రంగారెడ్డి ఉద్యమ సంస్థ నిరుద్యోగ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు గురువారం అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకపోవడంతో నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో జరిగిన బదిలీల్లో అవకతవకలు జరిగాయని, వాటిపై విచారణ చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్రమంగా జిల్లాకు వచ్చిన వారిని తిరిగి పంపించాలని డిమాండ్ చేశారు. గత అక్టోబర్‌లో తీసుకొచ్చిన స్టేతో 500 పోస్టులు కోల్పోయినట్టు తెలిపారు. జిల్లాలో ప్రమోషన్లు, బదిలీలు నిలిచిపోయయని వెంటనే ఆ ప్రక్రియ మొదలు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో నిరుద్యోగ ప్రతినిధి జి.ప్రవీణ్, నిరుద్యోగులు గట్టు విజయేందర్, పి.మహేశ్, రావుల లింగస్వామి, బత్తుల సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ చంద్రమౌళి

మొయినాబాద్‌రూరల్: రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మిషన్ భగీరథ నీటి సమస్య రాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఉమ్మడి జిల్లా మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ చంద్రమౌళి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ రెండు జిల్లాల్లో ఇంటింటి సర్వే కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నారని అన్నారు. నల్లా కనెక్షన్ లేని చోట కొత్త కనెక్షన్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందరికీ తాగునీరు అందించాలనే ప్రభుత్వ సంకల్పమని ఎక్కడా నీటి సమస్య రాకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో మండల పరిషత్ అధ్యక్షురాలు గునుగుర్తి నక్షత్రంజేవంతు, మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, మిషన్ భగీరథ డిప్యూటీ డీఈ ఇర్ఫాన్, మండల ఏఈ శివ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వీడని భూమిముడి!

నివేదికలకే పరిమితమైన భూ సమస్యలు

- స్పెషల్‌డ్రైవ్ చేపట్టినా ప్రయోజనం శూన్యం
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- పథకాలకు దూరమవుతున్నామని బాధితుల ఆందోళన



యాచారం తహసీల్దార్ కార్యాలయం

యాచారం: భూ సమస్యల చిక్కుముడి వీడడం లేదు. రేవంత్‌రెడ్డి సర్కార్ వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ధరణి పోర్టల్‌లో మార్పులు రాకపోవడంతో రైతుల్లో నిరాశే ఎదురవుతోంది. ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలోనే ధరణి పోర్టల్‌లో మార్పులు తెచ్చి ప్రతి భూ సమస్యను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టింది లేదు. దీంతో రైతుబంధు, బ్యాంకుల్లో పంట రుణాలు, రైతుబీమా తదితర పథకాలు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో భూములు అమ్ముకుందామనుకున్నా రికార్డుల్లో తమ పేర్లు లేకపోవడంతో బెంగ పట్టుకుంది. మండలంలోని 24 గ్రామాల్లో వివిధ రకాల భూ సమస్యలు 2,550 వరకు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. రేవంత్‌రెడ్డి సర్కార్ ఏర్పాటైన కొత్తలో మార్చి 1 నుంచి 9వ తేదీ వరకు భూ సమస్యలపై స్పెషల్‌డ్రైవ్ చేపట్టినా ఫలితం లేకపోయింది. స్థానిక తహసీల్దార్లకు ఎలాంటి లాగిన్లు ఇవ్వకపోవడంతో ప్రయోజనం లేకపోయింది.

నివేదికలతో సరి

మొత్తం 2,550 భూ సమస్యల్లో టీఎం-33 మ్యాడుళ్ల సమస్యలే 1,557 ఉన్నాయి. ఇప్పటి వరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి కేవలం 200 వరకు వివిధ రకాల భూ సమస్యలకు సంబంధించి నివేదికలనే ఉన్నతాధికారులకు పంపించారు. నివేదికలు పంపించిన భూ సమస్యల్లో కొన్ని ఇబ్రహీంపట్నం ఆర్డీఓకు, మరికొన్ని కలెక్టర్, సీసీఎల్ఏకు పంపించారు. యాచారం తహసీల్దార్ కార్యాలయం నుంచి పంపించిన సమస్యల్లో ఉన్నతాధికారులు ఎన్ని పరిష్కరించారు.. ఎన్ని తిరస్కరించారనే వివరాలు చిక్కడం లేదు. రెండు నెలల పాటు లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు భూ సమస్యల పరిష్కారాన్ని పక్కకు పెట్టేశారు. తాజాగా ఎన్నికల కోడ్ ఎత్తేయడంతో రైతులు మళ్లీ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

అన్నదాతకు ఆర్థికంగా నష్టం

ధరణి పోర్టల్‌లో మార్పులు రాకపోవడం, ఏళ్లుగా భూ సమస్యలు అలానే ఉండడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మూడేళ్లుగా 4వేల మంది ధరణి పోర్టల్‌లో తమ పేర్లు లేకపోవడంతో పట్టాదారు, పాసుపుస్తకాలు పొందలేకపోయారు. బ్యాంకుల్లో రుణాలు ఇవ్వడం లేదు. రైతుబంధు నిధులు అందడం లేదు. మరి కొద్ది రోజుల్లో రైతుబంధు నిధుల జమ, ఆగస్టు 15లోపు పంట రుణాలు మాఫీ చేస్తామన్న సర్కార్ ప్రకటనతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ధరణి పోర్టల్ తమకు శాపంగా మారిందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా పోయాయని మండిపడుతున్నారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నాం



కుర్మిద్ద రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 272, 273, 286, 287 లలో మూడున్నర ఎకరాల పట్టా భూమిని టీఎస్ఐఐసీ పేరు మీద మార్చేశారు. మా పేర్ల మీద మార్చాలని నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. రైతుబంధు, బ్యాంకు రుణాలు కోల్పోయాం.

– నేనావత్ శ్రీకాంత్ నాయక్, రైతు, కుర్మిద్ద

తహసీల్దార్‌కే లాగిన్లు ఇవ్వాలి



భూ సమస్యలకు సంబంధించి అన్ని లాగిన్లు తహసీల్దార్లకే ఇవ్వాలి. ఏ సమస్య ఏ అధికారి వద్ద పరిష్కారం అవుతుందో అర్థం కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగేళ్లుగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

– మర్పల్లి అంజయ్య యాదవ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నివేదికలు పంపించాం



తమ పరిధిలో ఉన్న లాగిన్ల మేరకు భూ సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. వారం, పది రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఆందోళన చెందాల్సిన పనిలేదు. రైతుల భూములు ఎవ్వరి పేర్ల మీద కావు.

– అయ్యప్ప, తహసీల్దార్, యాచారం

చెరువులను పరిరక్షించాలి

- అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించండి
- పకడ్బందీ చర్యలు చేపట్టండి
- ఆదేశించిన కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: చెరువుల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన నిర్మాణాలను తొలగించాలని, చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ కార్యాలయం సమావేశ మందిరంలో జోనల్ కమిషనర్, అదనపు డీసీపీలతో కలిసి చెరువులు, నాలాల పరిరక్షణపై మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, బఫర్ జోన్‌లోని అక్రమ నిర్మాణాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న ఆక్రమణలను తొలగించి కంచె ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల చుట్టూ ఫెన్సింగ్, హద్దు, సంరక్షణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

64 చెరువులకు పూర్వ వైభవం

శేరిలింగంపల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న 64 చెరువులను పరిరక్షించి, పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఇరిగేషన్, హెచ్ఎండీఏ, రెవెన్యూ శాఖలతో కలిసి నోటిఫైడ్ చేసిన చెరువు వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత పత్రాలను పొందుపర్చాలన్నారు. ప్రజాక్షేత్రంలో ఎఫ్‌టీఎల్ హద్దు మ్యాప్‌ల అంతిమ నోటిఫికేషన్‌ను జారీ చేయడానికి అధికారులను నోడల్ ఏజెన్సీగా నియమించుకొని చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల సంరక్షణకు ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, చెరువు భౌగోళిక స్వరూపం, సర్వే నంబర్లు, విస్తీర్ణం, ప్రాంతం, రెవెన్యూ మండలం వివరాలపై సమగ్ర స్థాయిలో సర్వే చేయాలన్నారు. కబ్జాలకు ఆస్కారం లేకుండా చెరువుల చుట్టూ ఫెన్సింగ్, పకడ్బందీ వివరాలతో చెరువు మ్యాపులను, సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

15 రోజుకోసారి నివేదిక ఇవ్వండి

శేరిలింగంపల్లి పరిధిలో ఉన్న చెరువులకు సరస్సు ఇన్‌చార్జి అధికారులను నియమించడం జరిగిందని జోనల్ కమిషనర్ స్నేహ షబరీష్ అన్నారు. సరస్సుల వద్ద సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. సరస్సు ఇన్‌చార్జులుగా నియమించబడిన అధికారులు ప్రతి రోజూ సరస్సుకు సంబంధించిన నిర్దిష్ట రిఫరెన్స్ పాయింట్‌ను సందర్శించి, చెరువుల వారీగా రిజిస్టర్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సరస్సుల్లో నీటి మట్టాలపై సందర్శించిన వెంటనే ఆయా వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు చెరువులను పర్యవేక్షించిన వెంటనే ఏమైనా అక్రమ నిర్మాణాలు, సీ అండ్ డీ వ్యర్థాల డంపింగ్, చెత్త డంపింగ్ చేయడం, సరస్సులోకి డ్రైనేజీ, కెమికల్ వాటర్ ఇన్‌ఫ్లో వంటివి గమనిస్తే వెంటనే సైట్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇరిగేషన్, డిప్యూటీ కమిషనర్ (ఎస్‌డబ్ల్యుఎం), శేరిలిం గంపల్లిజోన్ పరిధిలోని చెరువుల స్థితిపై 15 రోజులకు ఒకసారి నివేదిక సమర్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

'ధార్'.. పారాహుషార్

- దోపిడీ దొంగలతో జాగ్రత్త
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ



ఇబ్రహీంపట్నం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ధార్ ముఠా దోపిడీలు చేసేందుకు నగర శివారు ప్రాంతాల్లో సంచరిస్తోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహీంపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదు నుంచి ఆరు గురితో కూడిన ఈ ముఠాలు లాడ్జిల్లో ఉంటూ పగటిపూట ఆటోల్లో రెక్కీ నిర్వహించి రాత్రి పూట దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతుంటాయని తెలిపారు. ఈ భయంకరమైన ముఠా నగర శివార్లలో సంచరిస్తున్నట్లు ఆనవాళ్లతో పాటు స్పష్టమైన సమాచారం ఉందన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లు, పట్టణ శివారు ప్రాంతాల్లోని ఆవాసాలు, విల్లాలు, అపార్ట్‌మెంట్లను ఈ ముఠా టార్గెట్ చేస్తుందని చెప్పారు. మెయిన్ గేట్ వద్ద శబ్దం కాకుండా ప్రహరీ దూకి వచ్చి డోర్ కొడతారని, తలుపులు తెరిస్తే.. ఇంట్లోని వ్యక్తులపై దాడిచేయడంతో పాటు చంపేందుకు సైతం వెనకాడరన్నారు. అందినంతవరకు బంగారు నగలు, నగదు దోచుకెళ్తారని చెప్పారు. రాత్రి వేళ ఎవరు తలుపులు కొట్టినా నిర్ధారించుకోకుండా తీయొద్దని, అనుమానం ఉంటే కిటికీలోంచి గమనించాలన్నారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు.

అన్యాయాన్ని సహించేది లేదు

- ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత
- సమస్యల పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆశ వర్కర్లకు ప్రభుత్వం అన్యాయం చేస్తే సహించేది లేదని తెలంగాణ రాష్ట్ర ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవిత హెచ్చరించారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ.. ప్రతీ నెల 2వ తేదీన పారితోషకాలు ఇవ్వాలని, గతంలో ఇచ్చినట్లుగా ఇన్సూరెన్స్ రూ.50 లక్షలు చెల్లిస్తూ సర్క్యులర్ జారీ చేయాలని, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని, ఇస్తున్న పారితోషకంలో సగం జీతం ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని అలవెన్స్‌లు అందజేయాలని, పరీక్షల నిర్వహణ కోసం డ్యూటీలు వేస్తున్న ఆశాలకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేధింపులకు గురి చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి సంవత్సరం 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలని, మూడేళ్ల పెండింగ్ యూనిఫాంలు ఇవ్వాలని, పని భారం తగ్గించి జాబ్‌చార్ట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు సాయిబాబా, నాయకులు ఎల్లేష్, ప్రవీణ్, పోచమోని కృష్ణ, శేఖర్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ప్రధానం

రైళ్ల నిర్వహణపై మెట్రో ఎండీ సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: రైళ్ల నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ విభాగాలు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. ట్రాక్‌ల పటిష్టత, విద్యుత్ సరఫరా, రైళ్ల రాకపోకల నిర్వహణ వంటి అన్ని అంశాల్లో 24 గంటల పర్యవేక్షణ కొనసాగాలని పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ మెట్రో రైల్ భవన్‌లో వివిధ విభాగాలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని ఈ సందర్భంగా ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగితే సత్వరమే తగిన చర్యలు చేపట్టేవిధంగా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. వయాడక్ట్‌లకు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వరదనీరు నిల్వ లేకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. జాయింట్‌లు, నట్లు, బోల్టుల వంటి వాటి పటిష్టత ఎంతో ముఖ్యమని చెప్పారు. మెట్రో ట్రాక్ మార్గాల్లో ఫ్లెక్సీలు, అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులను తొలగించాలి. మరోవైపు వర్షాకాలంలో ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.

గిరిజన పాఠశాలలపై దృష్టి

ఏటీడీవో వెంకటయ్య



మైసిగండిలో రికార్డులు పరిశీలిస్తున్న వెంకటయ్య

కడ్తాల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, మరింత మెరుగ్గా రాణించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ సహాయ అధికారి(ఏటీడీవో) ఉడతనూరి వెంకటయ్య అన్నారు. మండల పరిధిలోని మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టిక, విద్యార్థులకు అందజేయనున్న పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలపై హెచ్ఎం బాలరాజ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, ఆహారం విషయంలో సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని, మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న నిరుపేద గిరిజన విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించేందుకు వీలుగా గత ఏడాది నుంచే 3 నుంచి 10వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన ప్రారంభించినట్టు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 2023-24 విద్యాసంవత్సరం పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. కడ్తాల్ గిరిజన బాలుర వసతి గృహంలో ఉంటూ, ఎస్ఎస్‌సీ పరీక్షలకు హాజరైన 55 మంది విద్యార్థులకు 54 మంది ఉత్తీర్ణత సాధించడంపై వసతిగృహ సంక్షేమాధికారి రాములును అభినందించారు. అనంతరం ఆయన మైసిగండి మైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని కలిసిన నాయకులు



నవీన్‌రెడ్డిని సన్మానించిన బీఆర్‌ఎస్ నేతలు

కడ్తాల్: ఇటీవల ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో ఘన విజయం సాధించిన నవీన్‌రెడ్డిని గురువారం కడ్తాల్ జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, వైస్‌ఎంపీపీ ఆనంద్, రైతుబంధు కోఆర్డినేటర్ జోగువీరయ్య, ఎంపీటీసీలు లచ్చిరామ్‌నాయక్, ప్రియారమేశ్, మంజుల చంద్రమౌళి, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, నాయకులు చందు, శివరాం, జైపాల్ ఉన్నారు.

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



మృతి చెందిన ఆవు

కేశంపేట: మండలంలోని బోధునంపల్లిలో గురువారం పిడుగు పడి పాడి ఆవు మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎన్నం కృష్ణారెడ్డి పాడిపరిశ్రమపైన ఆధారపడి జీవిస్తున్నాడు. రైతును ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అక్రమంగా సిలిండర్ల డంప్

97 గ్యాస్ బండలు స్వాధీనం

పహాడీషరీఫ్: పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచిన స్థావరంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. పోలీసులు వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాంకాలనీకి చెందిన త్రివిక్రం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ యజమాని నర్సింహా జల్‌పల్లిలోని మంచు టౌన్‌షిప్ సమీపంలో అక్రమంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచారు. సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి, రాజస్థాన్‌కు చెందిన మనీష్ బిష్ణోయి(19), రమేష్ బిష్ణోయి(28), ప్రేంరాజు బిష్ణోయి(29), సురేష్ బిష్ణోయి(29)లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఇండేన్ 45 ఖాళీ పెద్ద సిలిండర్లు, రెండు పెద్ద నిండు సిలిండర్లు, మూడు హెచ్‌పీ నిండు సిలిండర్లు, 19 హెచ్‌పీ ఖాళీ సిలిండర్లు, భారత్ ఖాళీ 17 పెద్ద సిలిండర్లు, సూపర్ గ్యాస్ ఒక పెద్ద సిలిండర్, హెచ్‌పీ ఐదు నిండు చిన్న



సిలిండర్లతో పట్టుబడ్డ నిందితులు

సిలిండర్లు, హెచ్‌పీ మూడు ఖాళీ చిన్న సిలిండర్లు, ఇండేన్ చిన్నది ఒక నిండు సిలిండర్, ఇండేన్ ఖాళీ రెండు చిన్న సిలిండర్లులతో పాటు బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. బ్లాక్ మార్కెట్‌లోకి విక్రయించేందుకు డంప్ చేసినట్లు పోలీసులు తెలిపారు. యజమాని పరారీలో ఉన్నట్లు చెప్పారు. తదుపరి విచారణ నిమిత్తం పహాడీషరీఫ్ పోలీసులకు అప్పగించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



యాదయ్య మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్ : గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట బ్యాంక్‌కాలనీలో నివాసముండే మర్లయాదయ్య (57) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం కూలీ పనికి వెళ్తుండగా గండిమైసమ్మ ఆలయం సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న స్రవంతి

అమ్మఆదర్శ కమిటీలు దేశానికే ఆదర్శం

మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ బడుల రూపురేఖలను మార్చడానికి అమ్మ ఆదర్శ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతిచందు తెలిపారు. గురువారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులకు, పాఠ్య, నోట్ పుస్తకాలను, యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అమ్మ అదర్శపాఠశాల కమిటీలు దేశానికే ఆదర్శం కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకాన్ని పెంచే విధంగా అమ్మఆదర్శ పాఠశాలల కమిటీలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టుతుందన్నారు. విద్యాసంస్థలు తెరిచేలోపు పాఠ్య, నోట్ పుస్తకాలను, యూనిఫాంలను పాఠశాలలు అందించడంలో రేవంత్ సర్కార్ సక్సెస్ అయిందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మంఖాల అనురాధ, ప్రధానోపాధ్యాడు పొగాకు సురేష్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ఆనంద్, సరిత, శైలజ, నళిని, కిరణ్‌లు పాల్గొన్నారు.

నక్షబాటను కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

షాబాద్: మండలంలోని చందన్‌వెల్లి నుంచి చందన్‌వెల్లి చెరువు, అంతిరెడ్డిగూడ గ్రామం వరకు ఉన్న నక్షబాటను కబ్జాకు గురికాకుండా చూడాలని చందన్‌వెల్లి గ్రామస్తులు గురువారం తహసీల్దార్ అన్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చందన్‌వెల్లి నుంచి చందన్‌వెల్లి చెరువు, మాచన్‌పల్లి వరకు గత 400 సంవత్సరాలుగా నక్షబాట ఉంది.. కొంతమంది రోడ్డును మూసివేసి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, స్పందించి నక్షబాట కబ్జాకు గురికాకుండా కాపాడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు చేవెళ్ల స్వామి, నర్సింహ్మారావు, వేమారెడ్డి, విఠల్‌రెడ్డి, గోపాల్, కిష్టయ్య, నరేష్, శ్రీనివాస్, సత్తయ్య, నర్సింహులు, కుమార్, రంగయ్య పాల్గొన్నారు.

పాఠశాల మరమ్మతు పనుల పరిశీలన

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ కుర్మల్‌గూడలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలో ప్రారంభించనున్న పాఠశాల మరమ్మతు పనులను మేయర్ చిగురింత పారిజాత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద మధ్యతరగతి ప్రజలు ఉన్న ఈ ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేయాలని విన్నవించామన్నారు. స్పందించి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాధికారి అనుమతులు ఇచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలన్నారు. ఇదే ప్రాంతంలో అంగన్‌వాడీ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్కకు విన్నవించినట్లు వెల్లడించారు. త్వరలో అంగన్‌వాడీ సెంటర్ మంజూరుతో పాటు టీచర్‌ను కూడా నియమించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేక పిల్లలు చదువులు మధ్యలోనే మనేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణ, డీఈఈ జ్యోతిరెడ్డి, నాయకులు బద్రమోని రమేశ్, ఆనంద్‌రెడ్డి, మల్లారెడ్డి, జంపయ్య, సాధిక్, కుమారి, మైన, హరి, జహంగీర్, రమేష్ తదితరులున్నారు.



పాఠశాల పనులను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

సెల్‌ఫోన్ల అందజేత



బాధితులకు ఫోన్‌లు అందజేస్తున్న ఎస్ఐ, పోలీసులు

తలకొండపల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ సహాయంతో కనుగొన్నారు. దొరికిన సెల్‌ఫోన్‌లను బాధితులకు పోలీసులు అందజేశారు. గురువారం ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. మండల కేంద్రంతో పాటు, చల్లంపల్లి, చీపునుంతల, పడకల్ గ్రామాలకు చెందిన నరసింహ, వరుణ్, నరసింహ, మహేశ్‌లు కొద్ది రోజుల క్రితం తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్ సహకారంతో సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ఆధారంగా సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్‌లు చోరీకి గురయితే సీఈఐఆర్ పోర్టల్‌ను ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

విస్తృతంగా ఎక్సైజ్ దాడులు



మహిళలను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

ఇద్దరు అరెస్టు

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాడ్గుల మండలంలో గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి, ఇద్దరిని అరెస్టు చేశారు. ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో ఎస్ఐ కృష్ణప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం మండల పరిధిలోని పలు తండాల్లో దాడులు నిర్వహించారు. దాడుల్లో బావోజీ తండాకు చెందిన నేనావత్ చప్లి వద్ద 3 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ఆమె అరెస్టు చేశారు. కుబ్యతండా పరిధిలోని బావోజీతండాకు చెందిన నేనావత్ బిక్కి వద్ద ఉన్న వంద లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి బిక్కిని అరెస్టు చేశారు. పల్లెతండాలో 50 లీటర్ల బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. వీటికి సంబంధించి మొత్తం నాలుగు కేసులను నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్ చౌహాన్ తెలిపారు. గతంలో నాటుసారా కేసులో పట్టుబడిన వారిలో ఇద్దరిని తలకొండపల్లి తహసీల్దార్ వద్ద, మరో ఇద్దరిని కడ్తాల తహసీల్దార్ వద్ద బైండోవర్ చేయడం జరిగిందని సీఐ వివరించారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బద్యానాద్‌చౌహాన్ హెచ్చరించారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య

చేవెళ్ల: గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సైతం సిద్ధంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న షాద్‌నగర్‌లో ఉపాధి హామీ పథకంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బీకే ఎంయూ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సు షాద్‌నగర్‌లో 15వ తేదీన ఉ. 11 గంటలకు ఉంటుందని చెప్పారు. నరేంద్రమోదీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పేదలకోసం తీసుకువచ్చిన ఈ పథకానికి నిధులు విడుదల చేయకుండా పనులు చేసిన కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ సదస్సుకు పెద్ద సంఖ్యలో కార్మికులు, నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దొంగల ముఠా సంచరిస్తోంది

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ : రాత్రి సమయాల్లో దొంగల ముఠాలు సంచరిస్తున్నాయన్నాయి.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి హెచ్చరించారు. తాజాగా హయత్‌నగర్, శివారు రాచకొండ కమిషనరేట్ పరిసర ప్రాంతాల్లో 'ధార్' అనే భయంకరమైన దొంగల ముఠా సంచరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఎవరైనా అనుమానంగా సంచరిస్తుంటే డయల్100కు సమాచారం ఇవ్వాలన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ : 87126 62302, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ 8712662650, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి ఫోన్ : 8712662293, ఎస్ఐ సునీల్‌కుమార్ ఫోన్ :8712662295, ఎస్ఐరమేష్ నాయక్ ఫోన్ : 8712662291 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

పెద్దేముల్: విద్యుదాఘాతంతో ఓ కాడెద్దు మృత్యువాత పడింది. ఈ ఘటన మండల పరిధిలోని కందనెల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. బోయిన చిన్న మొగులప్ప వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతేడాది రూ.1.80లక్షలతో కాడెడ్లను కొనుగోలు చేశాడు. ఓ రైతు పొలం చుట్టూ వేసిన కంచెకు విద్యుత్ వైర్ తగిలి కరెంటు సరఫరా అయింది. మేత మేస్తున్న ఎద్దుకు కంచె దగ్గరకు వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. వ్యవసాయ పనులు జరుగుతున్న సమయంలో రైతు ఎద్దు మృత్యువాత పడడంతో కన్నీరుమున్నీరయ్యాడు. ఎద్దు విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

వ్యవసాయ సహకార సంఘాలకు శిక్షణ



మాట్లాడుతున్న ఐసీఎం అధికారి శ్యామ్‌కుమార్

ఇబ్రహీంపట్నం: కేంద్ర కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ వారి సహకారంతో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సెక్రటరీలు, రైతులకు ఉప్పరిగూడ పీఏసీఎస్‌లో శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం సహకార సంఘాల అభివృద్ధికి చేపట్టుతున్న సేవలను వివరిస్తూ, చేపట్టాల్సిన అంశాలను ఐసీఎం అధికారి శ్యామ్‌కుమార్ అడిగి తెలుసుకున్నారు. అలాగే, సహకార సంఘ చట్టం, విధి విధానాల గురించి, భవిష్యత్తు ప్రణాళిక, రుణాల రికవరీ, మల్టీసర్వీస్, ఆడిట్, నాయకత్వ బాధ్యతలపై ఆయన వివరించారు. ఈ సందర్భంగా పలువురు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, సెక్రటరీ గణేశ్, ఇండియన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ అధికారి శ్యామ్‌కుమార్‌లు పాల్గొన్నారు. కాగా, ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణతో పాటు ఫీల్డ్ విజిట్‌ను చేయనున్నారు.

ఇంటిల్లిపాది.. రక్త బాంధవులే

- 142 సార్లు రక్తదానం చేసిన అంజిరెడ్డి
- పలువురు ప్రముఖుల నుంచి సత్కారం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

తలకొండపల్లి: సమాజంలో సేవలు పలు రకాలు.. కొంతమంది డబ్బులు వెచ్చించి సమాజసేవ చేసి మన్ననలు అందుకుంటారు. మరి కొంత మంది వినూత్నంగా ఆలోచించి గుర్తింపు పొందుతుంటారు. మండలంలోని లింగరావుపల్లి పంచాయతీ రామకృష్ణాపురం గ్రామానికి చెందిన అంజిరెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆ వృత్తిలో సరిపోనూ ఆదాయం ఉంది. జీవితం సాఫీగా నడుస్తుంది. కానీ, సమాజసేవ చేయాలనే తపన, పది మందికి సహాయపడాలనే మదిలో మెదిలిన ఆలోచనను అమలులో పెట్టాడు. విజయం సాధించాడు. ఆ ఆలోచనే రక్తదానమని అంజిరెడ్డి చెప్పాడు. గత 40 సంవత్సరాల నుంచి నేటి వరకు రక్తదానం చేస్తున్నాడు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్, చిరంజీవి బ్లడ్‌బ్యాంక్, తదితర స్వచ్ఛంద సంస్థలకు ఇప్పటివరకు 142సార్లు రక్తదానం చేశాడు. ఆయన ఒక్కడే గాక, తన కుటుంబ సభ్యులను కూడా భాగస్వాములు చేసి రక్తదానం చేయించాడు. ప్రస్తుతం రక్తదాత అంజిరెడ్డి రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా బ్లడ్ బ్యాంక్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఆయన భార్య మనోరమ్మ 50 సార్లు, పెద్ద కుమారుడు



కుటుంబ సభ్యులతో అంజిరెడ్డి

శివారెడ్డి 35 సార్లు, చిన్న కుమారుడు వివేకానందారెడ్డి 25 సార్లు, కూతురు స్రవంతి 20 సార్లు రక్తదానం చేశారు. ఆయన చేసిన సేవలకు ఎన్నో సన్మానాలు, సత్కారాలు అందుకొని పలువురి చేత మన్ననలు పొంది శభాష్ అనిపించుకున్నారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అలాగే, ఆనాటి రాష్ట్ర గవర్నర్లు నరసింహన్, తమిళసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా సన్మాన, సత్కారాలు అందుకున్నాడు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో చిరంజీవి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సినీ యాక్టర్లు రామ్‌చరణ్ తేజ్, చిరంజీవిల ద్వారా సన్మానం పొందాడు.

సమాజం బాగుండాలి

తాను బాగుండాలి, సమాజం బాగుండాలనే అనే ఉద్దేశంతో రక్తదానం చేశాను. కీర్తి, పేరు ప్రఖ్యాతుల కోసం రక్తదానం చేయలేదు. నా ఆలోచనకు అనుగుణంగా నా కుటుంబం నడవడం నాకు గర్వకారణం, రక్తదానంతో ఏలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవు. పైగా ఆరోగ్యం మరింత వృద్ధి చెందుతుంది. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలనేదే నా సందేశం.

– అంజిరెడ్డి, రక్తదాత, రామకృష్ణాపురం

తోటివారి ప్రాణాలు కాపాడాలి

భర్త అడుగుజాడల్లో నడుస్తూ, తోటివారి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో రక్తదానం చేస్తున్నాం. రక్తదానంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవు. ప్రతి మనిషి సేవాగుణాన్ని అలవర్చుకుంటే విశ్వవ్యాప్తంగా వ్యాధులు దరి చేరవు.

– మనోరమ, రక్తదాత, రామకృష్ణాపురం

సాక్షి క్లాసిఫైడ్స్

Education

రెగ్యులర్ & డిస్టెన్స్ అడ్మిషన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. *అడ్మిషన్లు పరిమితం. ఫోన్: 8866977112,339 [HA-14379]

Real Estate

BUILDING & CONSTRUCTION
అన్ని నిర్మాణ అవసరాలకు నాణ్యమైన నిర్మాణ ఇసుక సరసమైన ధరలకు 25KGల బ్యాగులో లభ్యం అవుతుంది & పెద్ద ఆర్డర్లకు ఇసుక టన్నుల్లో లభిస్తుంది. సంప్ర : 8187036931, 7660011002 [H-778814]

BUILDING MATERIAL
భవన నిర్మాణ కూల్చివేత వ్యర్థాలను GHMC వారి అధికారిక అనుమతి పొందిన సంస్థ ద్వారా సేకరించి తరలించబడును. సంప్ర: 18002030033, 7330000203. [H-778862]

FLAT FOR SALE
Brand New Flats For Resale. Gated Communities. Near Habsiguda, ECIL, Cherlapally, Yapral. Many Options For Every Budget. Call Now Ph: 08069045555 [HA-242]

Ready to Occupy New 3 BHK 1575 & 1675 Sq.Ft Super Deluxe Flats For Sale at Mallapur, Nacharam. Rathi Constructions Mahesh: 9848577552, 6302946914 [H-778922]

LAND FOR SALE
One Acre Agriculture Land For Sale In Aziznagar Near APPA Junction East & South Road Contact 9000149777, 9000149888 [H-796219]

LEASE COMMERCIAL
Liberty Circle Main Road Office Space For Long Lease In Grade A Commercial Property On 1st Floor 1735 Sft, SBA 4th Floor 8000 Sqft, 5th Floor 4000 Sqft with A/C Cabins Conference Rooms Pantry Decent Wash Rooms Sufficient Parking Ready to Occupy Contact 9989374555, 9866172688. [HA-97598]

PLOT FOR SALE
షాద్‌నగర్ @ కేశంపేట టౌన్‌లో DTCP లేఅవుట్లో ఫుల్ డెవలప్‌మెంట్స్‌తో 0% ఇంట్రెస్టుతో 40 EMI పద్ధతిలో ఓపెన్ ప్లాట్స్ కలవు. డైరెక్ట్ కంపెనీ ఆఫర్, సైట్ విజిట్ కొరకు. సంప్ర: 9949695027 [H-796166]

TLR Ventures Villa Plots With DTCP & 5 Years Oldmangolress @ Shadnagar Beside Bangalore Highway Bank Loan. 8501881336 [HA-62]

Services

BUSINESS SERVICE
మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-800406]

BUSINESS OFFER
లాభదాయకమైన వ్యాపారం కోసం లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్ స్థాపించండి. ప్లాస్టిక్ ఉద్యోగ్‌తో బై బ్యాక్ అగ్రిమెంట్. (Govt. అప్రూవ్) 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-5787]

PERSONAL CARE

CHANGE OF NAME
I, Ahmed Abdul Nayeem R/o H. No: 254, Srt Chandulal Baradari Colony, Bahadurpura, have changed my minor son's name from Abdullah to Abdullah Suleman [DA-35508]

I, Ahmed Abdul Nayeem R/o H. No: 254, Srt Chandulal Baradari Colony, Bahadurpura, have changed my minor son's name from Abdul Azeem to Abdul Azeem Sufwan. [DA-35510]

I, Pedamallu Venkata Bhaskara Sandeep Chakradhari, changed my name to Pedamallu Sandeep Chakradhari vide affidavit 28-05-24 sworn before notary K. Satyanarayana, Hyderabad-500030 [DA-10903]

I, UDITHYA RAJU S/o V BHENIKYA NAIK, R/o H.No. 3-33, Nagammagadda thanda, Kusumasamudram, Kulkacharla, Ranga Reddy Dist, TS. changed my name to VADITHYA RAJU S/o V BHENIKYA NAIK [HA-241]

I, SUSANTA KUMAR RANA R/o Flat No. 211, MCR Midhila Apartment, Saptagiri Colony, Kukatpally, Hyd-72, TG, has corrected my father's name as BAISHNAB CHARANA RANA vide affidavit dated 13th June 2024 for future purposes. [H-796169]

LOST
I, SIDDABATTUNI HARINATH S/o S. SUBBARAO (LATE), R/o. H. No. 7-1-621/356 382/2RT, Sanjeeva Reddy Nagar, Sanath Nagar, Hyd-38, T.S, My Original United States Green Card No. USCIS # 066-894-903, Category - F32 Has Been Lost by me While Travelling on my Bike If Any Found Please Call.9000521199 [H-778815]

OLD AGE HOME
వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్రూం, మేడిపల్లి / ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు. Ecil, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్ 7981467036, 9391039990, 9515474083. [H-778801]

Wanted

ప్రిజమ్ హాస్పిటాలిటీలో పనిచేయుటకు Exp. గల ఆపరేషన్ మేనేజర్, చెఫ్ మేనేజర్, కుక్స్, Asst కుక్స్, స్టోర్ కీపర్స్, సూపర్ వైజర్స్, అకౌంటెంట్ కావలెను. Qly: హోటల్ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్ / డిప్లొమా వారికి ప్రాధాన్యత. ఫోన్ 9100913395, 9100913394, 9949737037 [HA-13682]

ఉప్పల్ డిపో వద్ద మాఫార్మా కంపెనీకి ఆఫీస్ అనుభవం గల క్లర్క్ విత్ కంప్యూటర్ ఆపరేటర్, హెల్పర్ బాయ్స్, ప్యాకింగ్ గార్ల్స్ కావలెను. ఫోన్ 9515906315 [H-778816]

ఆటో డ్రైవర్లు కావాలి!! నెలవారీ జీతం రూ. 24,500/+ప్రోత్సాహకాలు, 10 లక్షల వరకు ఉచిత ఆరోగ్య & ప్రమాద బీమా. వలస డ్రైవర్లకు ఉచిత వసతి (హాస్టల్). ముందుగా చేరినవారికి అదనపు బోనస్. వివరాలకు: 040-45208854 [H-800415]

AR వాటర్ సొల్యూషన్స్ ఆఫీస్ నందు వర్క్ చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ మరియు RO టెక్నీషియన్స్ కావలెను. జీతం 13k +ఇన్సెంటివ్. LB నగర్ Near కామినేని హాస్పిటల్. 88867 08618 [G-824466]

అన్నపూర్ణ హోమ్‌కేర్ పెద్దవారికి సేవ చేయుటకు, పేషెంట్ కేర్, కేర్ టేకర్స్, ఆయాలు, స్త్రీ/పురుషులు, ANM/ GNM నర్సులు కావలెను. జీతం : 16000/- 30000/- రూమ్ + భోజన సౌకర్యం కలదు. ఫోన్ : 9390427894 [H-788094]

FACULTY TEACHERS
Vasavi Public School, Himayathnagar, Ph:040-23221712, 23220975. Walk-in-Interviews on 16.06.2024 from 09:30am. to 12:30pm. for Teachers in Primary - English & Science, Art Teacher & Pre-Primary. Salary is not a Constraint. Attractive Remuneration to Deserving Candidates, Including Earned Leave and Gratuity. You are Required to Bring Copies of Your Testimonials & Last Drawn Salary Certificate / Supporting Documents. [HA-554]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.